

గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని పశువైద్య శిబిరాలు మంగళవారం భీంపోలు పంచాయితీ నందకోట, బికొత్తకోట , గొండెంగుపాడు, లువ్వా, గుడ్డిమామిడి వలస గ్రామాలలో ఏర్పాటు చేసామని కాశీపట్నం పశువైద్య శాఖ అధికారి సాగరి. గణేశ్వరావు అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాలికుంటు, డెక్కలడుపు వంటి వ్యాధులు నివారించేందుకుగాను ముందస్తుగానే పశువులు, మేకలకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. 510 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, 426 మేకలు, గొర్రెలకు పారుడు వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో భీంపోలు పంచాయతీ సర్పంచ్ జన్ని భిమలమ్మ, ఎంపిటీసి సిరగం అశోక్ కుమార్, బొర్రా పంచాయతీ సర్పంచ్ జె.అప్పారావు, జూనియర్ వెటర్నరీ అధికారి జగదీష్ పాల్గొన్నారు.

టెక్నాలజీని వినియోగించుకోవాలి

» జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ » సమగ్ర శిక్ష ఆధ్వర్యాన వర్క్‌షాప్



వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: సులభతరమైన టెక్నాలజీని వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ సూచించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో హ్యూమన్ క్యాపిటల్ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్కూలింగ్ బిల్డింగ్ బ్లాక్స్ అండర్ ది ఓవరాచింగ్ థీ పై జిల్లా స్థాయి వర్క్‌షాప్ మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ దినేష్ మాట్లాడుతూ, 2047లో విద్యా విధానంలో తీసుకోవాల్సిన అంశాలపై ఐసిడిఎస్, సర్వశిక్ష, విద్యా శాఖ ప్రణాళికలు రూపొందించు కోవాలన్నారు. విద్యార్థి లక్ష్యాన్ని పరిధిలోకి తీసుకుని విద్యా బోధన చేయాలన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయునిదే అన్నారు. సెప్టెంబర్ నుండి డిసెంబర్ వరకు 4వేలు శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 2028 నాటికి పిల్లల్లో స్కిల్ పెంచే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని పాఠశాలల భవనాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. డ్రాప్ ఔట్లు లేకుండా ఉండేందుకు మంచి వాతావరణం, సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యార్థులను మోటివేషన్ చేయడానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీ, సర్వ శిక్ష ఏపిసి స్వామినాయుడు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఝాన్సీ రామ్ పడాల్, ట్రైబల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు క్రాంతి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు ఏఎ కోఆర్డినేటర్ భాస్కరరావు, సిఎంఓ జ్ఞాన ప్రకాశ్, అల్లూర్ నెట్ స్కూల్ కో ఆర్డినేటర్ కుర్మారావు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సురేంద్రకు వినతిపత్రాన్ని ఇస్తున్న బాధిత గిరిజనులు

క్వారీని తక్షణమే మూసివేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-హుకుంపేట: కొట్నాపల్లి నల్లరాయి క్వారీ కారణంగా భూములు, తోటలు, ఇళ్లు నష్టం పొందుతున్నామని బాధితులు మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్రకి తెలియజేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో సురేంద్ర మాట్లాడుతూ, హైవే రోడ్ నిర్మాణం కోసం ఇచ్చిన క్వారీ అనుమతులు రోడ్డు పనులు ముగిసిన ఏడు సంవత్సరాల తరువాత కూడా చట్టవిరుద్ధంగా కొనసాగుతున్నాయన్నారు. క్వారీ తక్షణమే మూసివేయాలని, భూములు నష్టపోయిన బాధితులకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి అనుమతులు వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల కమిటీ కార్యదర్శి టి.కృష్ణారావు, సీపీఎం మండల పరిషత్ వైస్ చైర్మన్ ఎస్.కొండలరావు, కొత్తపల్లి పీసా కార్యదర్శి జి.ప్రసాద్, గ్రామస్తులు పి.శ్రీను, కె.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్ప మండలం ఏర్పాటు చేయాలి


ఉప్ప సాధన కమిటీ భారీ ర్యాలీ


ఆందోళన చేపడుతున్న నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని ఓల్డ్ పంచాయతీ పరిధిలో ఉప్ప మండలం ఏర్పాటు చేయాలని ఉప్ప సాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ, ఆందోళన చేపట్టారు. 21 పంచాయతీల సర్పంచులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొని ఉప్ప మండలం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉప సాధన కమిటీ సభ్యులు టి. నారాయణరాజు, సిహెచ్. దేముడు, తౌడన్న, గోపాల్ పాత్రుడు మాట్లాడుతూ, జనాభా ఆధారంగా ఉప్పను మండలంగా ఏర్పాటు చేయడం న్యాయమన్నారు. ఉప్ప పరిధిలో 15 పంచాయతీలకు 250 గ్రామాలు, అనంతగిరి మండలం నుంచి 6 పంచాయతీలకు 220 గ్రామాలు ఉన్నాయని వివరించారు. హుకుంపేటకు 30నుంచి 40 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. మండలం ఏర్పాటు కోసం అవసరమైన భూములను గ్రామస్తులు స్వచ్ఛందంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉప్ప మండలం ఏర్పాటు చేయాలని, లేకపోతే 21 పంచాయతీల ప్రజలతో పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పి. సింహాచలం, పీ. మేరీ,కే. దేవుడమ్మ, కే. చిట్టిబాబు, కే. గణేష్, ఎంపీటీసీలు మీనా, ధర్మయ దొర, ఉప సాధన కమిటీ సభ్యులు రవిశంకర్, అశోక్, మధుసూదన్, వెంకట్, కోటి, కొండబాబు, శంకర్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పాలుకు ఎమ్మెల్సీ రవిబాబు పరామర్శ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: వైసిపి జిల్లా ఎస్టి సెల్ ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు బెంజిపుర్ గ్రామంలో మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితులను రవిబాబు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమంలో పాల్గొవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టి సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, మాజీ సర్పంచ్ గుడివాడ ప్రకాశ్, మాజీ ఎంపీటీసీ బుర్జ సుందర్ రావు, మాజీ సర్పంచ్ జి గోపాలరావు, మాజీ సర్పంచ్ పెద్ద మజ్జి అర్జున్,తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న రవిబాబు



మాట్లాడుతున్న ఉష

ఆదివాసీ మహిళా సంఘం మండల మహాసభ

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివాసీ మహిళ సంఘం మండల మహాసభ సంఘం నాయకులు కె.అరుణ, ఎస్.ప్రమీల అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా న్యాయవాది శెట్టి ఉష హాజరై మహిళా చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. జిల్లా మహిళ సంఘం అధ్యక్ష కార్యదర్శి ఎస్.హైమావతి, కౌసల్యలు వివిధ తీర్మానాలు చేశారు. వాటిలో ప్రధానంగా: జివో 3, రేషన్‌లో 12 రకాల సరుకులు, ఉపాధి హామీ కింద 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలి, అర్హులకు ఉచిత గ్యాస్ పథకం, 50 ఏళ్లు దాటిన ఆదివాసీ మహిళలకు పెన్షన్ తదితర వాటివి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో పాడి కీర్తన, కూడా సుందరమ్మ పాల్గొన్నారు.

పాడేరులో రైతు సంబర సభ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే, టిడిపి పాడేరు ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో కూటమి నేతలు మంగళవారం అన్నదాత సుఖీభవ రైతు సంబర సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాక్టర్లతో ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ పాల్గొని ట్రాక్టర్ నడిపారు. ఈ ర్యాలీ తలారిసింగి నుండి ఆర్ టిసి కాంప్లెక్స్, సినిమా హాల్ సెంటర్ మీదుగా అంబేద్కర్ సెంటర్ పాత బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసిందన్నారు. రైతులకు రాయితీపై డ్రోన్లు, యంత్రాలు, యంత్ర పరికరాలు ఇచ్చి కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఎం.ఎ.బేబీ పర్యటనను జయప్రదం చేయండి

● సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి- రంపచోడవరం : దేవీపట్నం మండలంలో ఈ నెల16న సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, సిపిఎం రాజ్యసభ పక్షనేత జాన్ బ్రిట్టస్ నిర్వాసితుల కాలనీలో పర్యటించనున్నారని పర్యటనను జయప్రదం చేయలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. మంగళవారం రంపచోడవరం సిపిఎం కార్యాలయంలో నడుపూడి వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన దేవీపట్నం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం నిర్వాసిత కాలనీలలో అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం గానీ, ప్రభుత్వ అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకోవడంలేదని నిర్వాసితుల పట్ల ఇంతటి నిర్లక్ష్యం తగదని అన్నారు. ఇప్పటికే అనేకమార్లు రంపచోడవరం ఐటిడిఎ ఎదుట, ధవలేశ్వరం ప్రాజెక్టు ఆఫీస్ వద్ద ఆందోళన చేసినప్పటికీ తాగునీటి సమస్య గాని, రేషన్ సమస్య గాని, పరిష్కరించకపోగా నిర్వాసితులు ఇచ్చిన అర్జీలు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయన విమర్శించారు. సమస్యల పరిష్కారానికై ఇప్పటికే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడుని కలవడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా త్వరగతిన నిర్వాసితుల సమస్యలు పరిష్కరానికి శ్రీకారం చుట్టాలని కోరారు. ఈ నెల 16వ తేదీన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, సిపిఎం రాజ్యసభ పక్ష నేత జాన్‌బ్రిట్టాస్ దేవీపట్నం నిర్వాసితుల సమస్యలు తెలుసుకోవటానికి హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, నిర్వాసితుల సంఘం నాయకులు కారం సోమరాజు, శివ, గంగరాజు, సాయి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోకనాథం

రాజవొమ్మంగిలో భారీ వర్షం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ తీవ్రమైన ఎండ కాసింది. సాయంత్రం మబ్బులు కమ్ముకుని భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన మన్యంవాసులు సేద తీరారు. వరి నాట్లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు తిరిగితే కఠినచర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రహదారులపై విచ్చలవిడిగా దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని జడ్డంగి ఎస్ఐ చినబాబు హెచ్చరించారు. సోమవారం జడ్డంగి పోలీస్‌స్టేషన్లో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఎస్ఐ చినబాబు చర్యలు చేపట్టారు. మంగళవారం ట్రాక్టర్ డ్రైవర్లకు ఎస్ఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. దమ్ముచక్రాలతో ట్రాక్టర్లను నడపడం వలన రహదారి పాడవుతోందని సూచించారు. ఇకపై ఎవరూ రహదారులపై దమ్ముచక్రాలతో ట్రాక్టర్లు నడపరాదని తెలిపారు.


ఎస్ఐ చినబాబుకు ఫిర్యాదు చేస్తున్న లోతా రామారావు



మాట్లాడుతున్న మానిటరింగ్ సభ్యులు దేవదాస్

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - జికె వీధి : మండలంలోని వివిధ కార్యాలయాలను జిల్లా ఎస్‌టి, ఎస్సి విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు వంతల దేవదాస్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం సందర్శించి ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలను నిలువరించాలని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణశాఖ కార్యాలయం, వెలుగు, ఎన్ఆర్ఈజిఎస్ కార్యాలయం సందర్శించి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎంపిటిసి, జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు రీమల రాజేశ్వరి, బిజెపి సీనియర్ నేత అనిల్ రీమలపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంజం జోగారావు

ఆదివాసీల హక్కుల సాధనకు కృషి

ప్రజాశక్తి - దేవీపట్నం: ఆదివాసీ దినోత్సవం అంటే పండగలాగ చేసుకోవడం కాదని, ఆదివాసీల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు ప్రతినబూనడమే ఆదివాసీ దినోత్సవ సందేశం అని రాష్ట్ర రైతుకూలి సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహాయ కార్యదర్శి వంజం జోగారావు, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వేట్ల సత్యనారాయణ స్పష్టం చేశారు. మండలంలోని మంటూరు ఆర్అండ్ఆర్ కాలనీలో ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. చదల పోశారావురెడ్డి అధ్యక్షత వహించారు. కొండమొదలు సర్పంచ్ వేట్ల విజయ, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తాతి బుల్లబ్బాయి, పి.వెంకటకృష్ణ, ఎం.పెంటారావు, చంద్రావు తదితరులు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుతో లక్షలాదిమంది గిరిజనులకు సరైన పునరావాసం కల్పించడం లేదన్నారు. నిర్మించిన పునరావాస కాలనీల్లో కూడా పూర్తిస్థాయి మౌలిక వసతులు లేవని విమర్శించారు. అటవీ సంరక్షణ చట్టాలు, అటవీ హక్కుల చట్టాలు కూడా సరిగ్గా అమలు కావడం లేదన్నారు. జిఒ3 రద్దు కూడా అన్యాయమని, పార్టీలకు అతీతంగా ఈ సమస్యలన్నిటిపైనా పోరాడాలని పిలుపునిచ్చారు.

'డొంకరాయిపై మాట మార్చారు'

ప్రజాశక్తి-మోతుగూడెం: అల్లూరి సీతారామరాజు జిల్లా, వై.రామవరం మండలం, డొంకరాయి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని ఈ ప్రాంత ప్రజలు 15 ఏళ్లుగా పోరాటం చేస్తే అప్పటి ఐటిడిఎ పిఒ, ఇప్పటి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ లిఖితపూర్వక హామీ ఇచ్చి, ఇప్పుడు మాట మార్చి గుర్తేడు కేంద్రంగా మండలం ఏర్పాటు చెయ్యాలి అని ఆదేశాలు ఇవ్వడం అన్యాయమని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే మరో ఉద్యమం చేపడతామని మండల సాధన పోరాట సమితి అధ్యక్షులు కరకా వెంకటరమణ అన్నారు. వై. రామవరం మండలం బొడ్డగండి పంచాయితీలో డొంకరాయి గ్రామం చుట్టుప్రక్కల 36 గ్రామాలు, సుమారు 9వేల మంది జనాభా ఉన్నారు. వై.రామవరం పంచాయతీకి వెళ్ళడానికి 192 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని డొంకరాయిని మండల కేంద్రంగా చేయమని అడిగితే మాట తప్పి, డొంకరాయి గ్రామానికి 165 కిలోమీటర్లు దూరం లో ఉన్న గుర్తేడు పంచాయతీలో కలిపారు అని దీంతో ఆయా గ్రామాల వారంతా ఇబ్బందుల్లో పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వై.రామవరం మండల టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ ప్రేమకిరణ్, వార్డ్ మెంబర్ నీలాపు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ప్రభుదాస్, ఎస్సి అసోసియేషన్ మద్దెల యాకోబు, ప్రజాసంఘాలు, వివిధ పార్టీల వారు పాల్గొన్నారు.

గుర్తేడు మండల కేంద్ర ప్రకటనపై హర్షం

ప్రజాశక్తి-వై.రామవరం: గుర్తేడును మండల కేంద్రంగా ప్రకటించినందుకు గుర్తేడు సర్పంచ్ గొర్లె దుస్యంతుడు, పాతకోట సర్పంచ్, కానువాడ సర్పంచ్‌లు ఎమ్మెల్యే శిరీషదేవికి కృతజ్ఞతలు తెలిపారు. వై.రామవరం మండలం అప్పర్ పార్ట్ అయిన గుర్తేడు, పాతకోట, దారగడ్డ, బుడ్డగండి, కానివాడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో సందర్శించినప్పుడు ఈ ప్రాంతవాసులు మండల కేంద్రం వై.రామవరం దూరంగా ఉందని కార్యాలయాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామని ఆమెకు విన్నవించారు. స్పందించిన ఆమె గుర్తేడును మండల కేంద్రంగా ప్రకటించేందుకు కృషి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషదేవికి ఆయా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానికేతర భూస్వాములకు కొమ్ము కాయడం అన్యాయం

ప్రజాశక్తి -విఆర్‌పురం: స్థానికేతర భూస్వాముల పక్షాన బిజెపి గిరిజన నాయకులు మాట్లాడుతున్నారని ఇది చాలా అన్యాయమని ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు పాయం సీతారామయ్య విమర్శించారు. కూనవరంలో మంగళవారం ఆయన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ మండల అధ్యక్షుడు తెల్లం తమ్మయ్య మాట్లాడుతూ జూన్ 23న కూనవరం మండల తహశీల్దార్‌కు ప్యాకేజీ తీసుకున్న భూములు, స్థానికంగా లేనటువంటి భూస్వాముల భూములను భూమిలేని ఆదివాసీ గిరిజనులకు వ్యవసాయం చేసే అవకాశం ఇవ్వాలని వినతిపత్రం అందించినట్టు గుర్తు చేశారు. కానీ కొంతమంది గిరిజన బిజెపి నాయకులు గిరిజనేతరుల భూములను సిపిఎం నాయకులు జెండాలు పాతి ఆక్రమిస్తున్నారని పత్రికాప్రకటనలు చేస్తున్నారని అటువంటి వార్తలు నమ్మవద్దని తెలిపారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు బాబు బొరయ్య, మడకం జ్యోతి, మడం పొద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా వైసిపి పంచాయతీ కమిటీలు

ప్రజాశక్తి-జికెవీధి: మండలంలోని వైసిపి మండల అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్, ఎంపిపి బోయిన కుమారి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి పంచాయితీ కమిటీలు ఏర్పాటు చేశారు. మొండిగెడ్డ పంచాయతీ అధ్యక్షునిగా గబులంగి సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కొర్ర లింగేశ్వరరావు, రైతు విభాగం అధ్యక్షునిగా లోచల సత్య నారాయణ, ప్రధాన కార్యదర్శిగా గెమ్మెల నాగేశ్వరావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా నాగమణి, ప్రధాన కార్యదర్శిగా శాంతిని ఎన్నుకున్నారు. జర్రెల పంచాయితీ అధ్యక్షునిగా కర్ణం గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా జోబా స్వామినాథం రైతు విభాగం అధ్యక్షునిగా వంతల రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గెమ్మెల సూరిబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలుగా లోవలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమం లో సర్పంచ్ అడపా ప్రియాంక, వైస్ ఎంపిపి లోత దేముడు, మండల ఉపాధ్యక్షులు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- రంపచోడవరం : రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్మన్ ఎం.శిరీషదేవి, విజయ్ భాస్కర్ అన్నారు. మండలంలోని పోలవరం నుండి రంపచోడవరం వరకూ మంగళవారం అన్నదాత సుఖీభవ ర్యాలీ నిర్వహించారు. తొలుత రంపచోడవరం ప్రధానకేంద్రంలోని మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతపురం గోగుమిల్లిలో రైతు పారా వెంకన్న పొలంలో భూమిపూజ చేసి వరి నాట్లు వేశారు. అనంతరం ట్రాక్టర్, ద్విచక్రవాహనాలతో తెలుగు యువత అధ్యక్షులు ఎం.విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గం పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు చిన్నంబాబూ రమేష్, సీతశెట్టి వెంకటేశ్వరరావు ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, రైతు అధికారప్రతినిధి కనిగిరి రాంబాబు, జిసిసి డైరెక్టర్ గొర్లె సునీత తదితరులు పాల్గొన్నారు.


వరి నాట్లు వేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

కూనవరం: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొదటి విడత నిధులు విడుదల చేసి రైతులఖాతాలో ఏడు వేల రూపాయలు జమ చేసి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సందర్భంగా మండలంలోని కాచవరం గ్రామం నుండి ట్రాక్టర్లతో ర్యాలీగా పోచవరం కాలనీ దూగుట్ట కుళ్లపాడు గ్రామాల మీదుగా నర్సింగపేట వరకూ ర్యాలీ నిర్వహించారు. కూనవరం మండల సొసైటీ చైర్మన్ తోటకూర వెంకటేశ్వరరావు,

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

ప్రజాశక్తి -సీలేరు: సెప్టెంబర్ 1 నుంచి 4 వరకు తెలంగాణ ట్రాన్స్కో ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఎలక్ట్రిసిటీ కబడ్డీ పోటీలకు ఎపి తరపున ఎలక్ట్రిసిటీ కబడ్డీ జట్టుకు సీలేరుకు చెందిన ఎపి జెన్‌కో ఎడిఇ శ్రీనివాసరావును కెప్టెన్‌గా ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ నియమించింది. ఈ మేరకు ఆదేశాలు వెలువడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 14 మంది సభ్యులతో కూడిన జట్టును మంగళవారం ప్రకటించారు. ప్రకటించిన జట్టు విజయవాడలో ఈనెల 17 నుంచి 26 వరకు జరిగే కోచింగ్ క్యాంప్‌నకు హాజరుకావాలని జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 30 తేదీ కల్లా విజయవాడ హాజరు కావాలని ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆదేశాలు జారీ చేసింది.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

-ప్రారంభించిన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల (బాలికల) శ్రీకృష్ణాపురంలో మంగళవారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తో కలిసి విద్యార్థినీలకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలలో నులిపురుగులు పోషకాలను శోషించడంలో ఆటంకం కలిగిస్తాయన్నారు. దీంతో రక్తహీనత, పోషకాహార లోపం, మానసిక, శారీరక అభివృద్ధి దెబ్బతింటుందని చెప్పారు. ఈ సమస్యను నివారించడానికి ప్రభుత్వం 2 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ నులిపురుగుల మాత్రలు అందజేస్తుందన్నారు. నులిపురుగులు ఉన్న పిల్లల్లో రక్తహీనత, పోషణ లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలకు గురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ, 2 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల మొత్తం 3,16,754 మంది అర్హులైన పిల్లలు, విద్యార్థులు ఉండగా వీరిలో 3,02,816 మందికి అల్బెండజోల్ మాత్రలను అందించడం జరిగిందని, 95.6 శాతం పూర్తైందన్నారు. జిల్లా వ్యాప్తంగా 4,321 బూత్‌లు ఏర్పాటు చేసి, 336 మంది పర్యవేక్షణ సిబ్బందిని నియమించామన్నారు. మాత్రలు తీసుకోని విద్యార్థులకు మాప్-అప్ రౌండ్ ద్వారా 20.08.2025 న మాత్రలు పంపిణీ చేయడం జరుగునని తెలిపారు. అల్బెండజోల్ మాత్రల వలన ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని, అయితే ఏవైనా సమస్యలు తలెత్తితే సమీప వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్.బి.ఎస్.కె జిల్లా ప్రోగ్రామ్ అధికారి ప్రతాప్, పి.హెచ్.సి. వైద్యాధికారి, ప్రోగ్రామ్ మేనేజర్ ఏగిరెడ్డి కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని డుంబ్రిగుడ, కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో వైద్య అధికారులు పి రాంబాబు, నజీబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు నులిపురుగుల మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. గసభ పంచాయితీ మొర్రిగుడ గ్రామంలో స్థానిక సిహెచ్ సర్పంచ్ పి సునీత చిన్నారులకు నులిపురుగుల మాత్రలను వేశారు. అరమ, గేదెబంద, జరాయి గ్రామాల్లో వైద్య అధికారి పి రాంబాబు నులి పురుగుల మందులను వేయించారు.



గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

అరకులోయలో కుక్కల బెడద

ప్రజాశక్తి- అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకు లోయలో కుక్కల బెడద నెలకొంది. ఎక్కడపడితే అక్కడ కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో పర్యాటకులు, స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇటీవల కాలంలో అనేకమంది పై కుక్కలు దాడి చేయడంతో గాయాలపాలై ఆస్పత్రి పాలైన సంఘటనలు ఉన్నాయి. ప్రధాన రహదారి, షాపు వద్ద కుక్కలు గుంపులు గుంపులుగా విహరిస్తుండడంతో పాదచారులు, వ్యాపారస్తులు భయపడుతున్నారు. రోడ్లపై ఒక్కొక్కరు తిరుగుతుంటే వారిపై దాడులకు ఎగబడుతున్నాయి. దీంతో గాయాల బారిన పడవలసి వస్తుందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిలో కుక్కల బెడద అధికంగా ఉండడంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. పెదలబుడు పంచాయితీ సిబ్బంది స్పందించి కుక్కల నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-పాడేరు: అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్య అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమగ్ర ప్రచార అవగాహన కార్యక్రమాల (ఐఈసీ క్యాంపెయిన్-2025) గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఎ ఎస్.దినేష్ కుమార్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా రెండు నెలల పాటు ప్రచార, అవగాహన కార్యక్రమాలు వైద్య ఆరోగ్యశాఖ యంత్రాంగం కొనసాగించనున్నారు. యువతను దష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాలు చేపట్టనున్నారు. హెచ్ఐవీ/ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే వ్యాధులు, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర నాయుడు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి కిరణ్ కుమార్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి.ఎన్ ప్రతాప్, ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఉద్యోగులు క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ రామచందర్, జిల్లా ఆరోగ్య పర్యవేక్షకులు యం. సంజీవ్ పాత్రుడు, డేటా మేనేజ్మెంట్, డాక్యుమెంటేషన్ ఆఫీసర్ చిరంజీవి పాల్గొన్నారు.

గుండె పోటుతో ఖైదీ మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో ఖైదీ గుండె పోటుతో సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. జైలు అధికారుల కథనం ప్రకారం... ఆరిలోవ కాలనీ దుర్గాబజార్‌కు చెందిన కోలాటి బాలయోగి (75) పోక్సో కేసులో శిక్ష పడి 2022 అక్టోబర్ 17 నుంచి కేంద్రకాగారంలో ఖైదీగా ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం కేంద్రకారాగారంలో గుండె పోటు వచ్చి కుప్పకూలిపోయాడు. జైలు అధికారులు వెంటనే చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందినట్టు తెలిపారు.

రేషన్ సరుకులు ఇవ్వకపోవడంపై నిరసన

ప్రజాశక్తి-పెదబయలు : పెదబయలు మండల కేంద్రంలోని డిఆర్ డిపో ద్వారా ఆగస్టు నెల 12వ తేదీ వచ్చినా లబ్ధిదారులకు, అంగనవాడీ సెంటర్లకు రేషన్ సరుకులు ఇవ్వకపోవడంపై ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన డిఆర్ డిపో ముందు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ జిసిసి అధికారులు, డిఆర్ డిపో సేల్స్‌మేన్ డిపో తీయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, రేషన్ లబ్ధిదారులకు అంగన్వాడీ సెంటర్లకు సరుకులు పంపిణీ చేయడం లేదని పేర్కొన్నారు. వచ్చిన బియ్యం, పప్పులను ఒడిశా ప్రాంతానికి తీసుకెళ్లి అమ్ముకొని సరుకులు దారి మళ్లిస్తున్నారని ఆరోపంచారు. కొన్ని నెలల ముందు నుండి కొద్దిమందికి మాత్రమే బియ్యం ఇచ్చి మరి కొద్ది మందికి మరో నెలలో ఇస్తూ మేనేజ్మెంట్ చేసుకుంటూ కాలాపన చేస్తున్నారని తెలిపారు. ఇటీవల స్థానిక జిసిసి బ్రాంచ్ గొడౌన్ సూపర్వైజర్ దినాకుమారి గోదాముల్లో వచ్చిన బియ్యం, ఉప్పులు పప్పులను అమ్ముకొని లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడడంతో ఆమెను ఉద్యోగం నుండి సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. ఆ లోటును పూడ్చుడానికి మండలంలోని కొన్ని డిఆర్ డిపోలకు బియ్యం స్టాక్ వేయకుండా రేషన్‌కార్డుదారుల పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. సీతగుంట పంచాయతీ పరిధిలోని రేషన్ లబ్ధిదారులకు తక్షణమే రేషన్ సరుకులు పంపిణీకి చర్యలు తీసుకోవాలని, లేకుంటే జిసిసి కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జంబు దేవరాజు, రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు



శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

సిసి డ్రైయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని కొత్తపాలెం పంచాయతీ ఉరిసింగి, మామిడిపల్లి గ్రామాలలో రూ.10 లక్షలు జెడ్‌పిటిసి నిధులతో సిసి డ్రెయినేజీల నిర్మాణానికి జెడ్పిటిసి పోతురాజు బాలయ్య, ఎంపీపీ కోరాబు అనూష దేవి, స్థానిక సర్పంచ్ వనగల సోమరత్నం మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెడ్పీ, మండల పరిషత్ నిధులతో ఈ నాలుగు సంవత్సరాల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. మండలంలో మంచినీటి సమస్య తీర్చడానికి సుమారు 40 పైన మంచినీటి బోర్లు వేయించినట్లు తెలిపారు. ఎంపీతో మాట్లాడి చింతపల్లిలో రూ.40 లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఏకలవ్య ఆశ్రమ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శారద, ఉప సర్పంచ్ పాంగి మోహన్ రావు, జెఇ స్వర్ణలత, వైసిపి ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జల్లి సుధాకర్, వైసిపి రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్ సభ్యులు భీమరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-చింతపల్లి : మన్యం వీరుడు అల్లూరి ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని పెందుర్తి శాసనసభ్యులు, ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.విజయభారతి ఆధ్వర్యంలో మంగళవారం మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, జనసేన అరకు పార్లమెంట్ అధ్యక్షులు వంపురు గంగులయ్యలతో కలిసి పంచకర్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ కోనల్లో తిరుగుతూ గిరిజనులకు అండగా నిలబడిన అడవి బిడ్డల ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరితో గిరిజన బిడ్డలు ఎందరో పోరాడారని, ఉద్యమాలకు, పోరాటాలకు ఊపిరి పోసిన నేల మన్యం ప్రాంతమని తెలిపారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు అంటే తనకు ఎంతో గౌరవమని, ఇక్కడివారు స్వాగతం పలికిన తీరు తనను ఎంతగానో ఆకర్షించిందని వెల్లడించారు. అనంతరం కళాశాల విద్యార్థుల ప్రదర్శించిన గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు.

ఫలించిన పోరాటం

ఆశా వర్కర్ల సమస్యలపై స్పందించిన ప్రభుత్వం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాజీ లేని పోరాటాలతో గ్రాడ్యూటీ, 180 రోజుల మెటర్నటీ లీవు, 62 సంవత్సరాలకు రిటైర్మెంట్ పెంపును సాధించుకున్న ఆశ వర్కర్లను సిఐటియు జిల్లా కమిటీ తరుపున జిల్లా కమిటీ అభినందనలు తెలుపుతున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు తెలిపారు. పోరాటాలతో 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంపు, ఏడాదికి రూ. 5 వేలు చొప్పున గరిష్టంగా రూ. 1,50,000 గ్రాడ్యూటీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 94ను విడుదల చేయడంపై సిఐటియు జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు.



బీచ్‌రోడ్డులో హర్‌ఘర్ తిరంగా యాత్రలో భాగంగా బైక్‌ర్యాలీ

స్వాతంత్ర్య స్ఫూర్తిని పెంపొందించాలి

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: భావితరాల్లో భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని పెంపొందిద్దామని, మాతృభూమి రుణం తీర్చుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బీచ్‌రోడ్డులో హర్ ఘర్ తిరంగా యాత్రను జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత పౌరులుగా మనందరం దేశానికి చాలా తిరిగి ఇవ్వాలన్నారు. మంచి నడవడిక, సాటి పౌరుల పట్ల సోదరభావం, గౌరవ భావం కలిగి ఉండటం ద్వారా స్వాతంత్ర్య స్ఫూర్తిని కాపాడవచ్చు అని సూచించారు. ప్రాథమిక హక్కులతో పాటూ ప్రాథమిక విధులను కూడా ఉన్నాయని గుర్తెరగాలి అన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

హర్‌ఘర్‌తిరంగా యాత్రలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ వసతి గహ విద్యార్థులు థింసా నత్యం చేయగా, గాజువాకకు చెందిన విద్యార్థులు భరతనాట్యం ప్రదర్శించారు.కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి మాధవి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి రామారావు, బెటాలియన్ కమాండెంట్ భగత్‌సింగ్, 198, 234 బెటాలియన్లకు చెందిన ఇతర అధికారులు, సిబ్బంది, డివిజనల్ పిఆర్ఒ నారాయణరావు, ఎవి సూపర్‌వైజర్ వెంకటరావు, ఎఇ రామకృష్ణ, టూరిజం అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను సత్కరించిన స్థాయీసంఘ సభ్యులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ఇటీవల ఎన్నికైన స్థాయి సంఘం సభ్యులు నగర మేయర్ పీలా శ్రీనివాసరావును మంగళవారం పెందుర్తి మేయర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్థాయిసంఘం సభ్యులు విశాఖ నగర అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని, స్థాయి సంఘంలో ప్రతి అంశం అభివృద్ధి కోసం ప్రాధాన్యత ఇస్తూ క్షుణ్ణంగా చర్చ జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో స్థాయిసంఘం సభ్యులు కొణతాల నీలిమ, గంకల కవిత, దాడి వెంకట రామేశ్వరరావు, సేనాపతి వసంత, గేదెల లావణ్య, రాపర్తి త్రివేణి వరప్రసాద్, మాదంశెట్టి చిన తల్లి, మొల్లి ముత్యాలు, టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

హక్కులను హరిస్తున్న జిఒలను రద్దు చేయాలి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విద్యార్థుల హక్కులను హరిస్తున్న జిఒలను రద్దు చేయాలని డాక్టర్ సీఎన్. క్షేత్రపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్‌ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం నగరంలో ఎయు వద్ద మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ సీఎన్. క్షేత్రపాల్‌రెడ్డి హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐఎస్‌ఎఫ్ బ్రిటిష్‌వారిని తరిమి కొట్టడం కోసం ఆవిర్భవించిన సంఘం అని కొనియాడారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు మాట్లాడుతూ ఎన్డియే ప్రభుత్వం గతంలో ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చారని వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకం చాలామందికి అందలేదని, బిసి, ఎస్సి, ఎస్టి మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



చింతూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి

ప్రజాశక్తి- చింతూరు: మండలంలోని చింతూరు సచివాలయం ఎర్రంపేట, పోతనపల్లిలో సర్పంచ్ కన్నారావు అధ్యక్షతన మంగళవారం రైతుసదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి రత్నప్రభ మాట్లాడుతూ వరిలో మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. ఈ ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన ఈ నెల 15వ తేదీ లోగా రైతులు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఉద్యానఅధికారి ముత్తయ్య వ్యవసాయ సహాయకులు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **కూనవరం:** కొండ్రాజుపేట సచివాలయం పరిధి శబరి కొత్తగూడెం గ్రామసర్పంచ్ అధ్యక్షతన మంగళవారం రైతుసదస్సులు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి దేవి వరిలో మెరుగైన యాజమాన్య పద్ధతులు, మెలకువల గురించి రైతులకు తెలియ జేశారు. వరికి క్రాప్ ఇన్స్యూరెన్స్ (ఎకరాకు రూ.646/-) ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.


చిల్లర వర్తకులపై కక్ష సాధింపు చర్యలు దారుణం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: నగరంలోని తోపుడుబండ్లు, చిల్లర వర్తకులపై జనసేన కార్పొరేటర్ పీతలమూర్తి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కళాభారతి తోపుడుబళ్ల, చిరు వ్యాపారుల సంఘం నాయకులు బన్నీ మండిపడ్డారు. తోపుడు బళ్ళు వ్యాపారుల కోసం కోర్టు తీర్పు ఉన్నప్పటికీ కార్పొరేటర్ కక్ష సాధింపుపై మంగళవారం స్థానిక పిఠాపురం కాలనీ కళాభారతి పార్కు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం కాలనీలోని మొత్తం తోపుడుబళ్ల కార్మికులను, వారానికి రెండు గంటలు వ్యాపారం చేసుకునే సంత వ్యాపారస్తులను తొలగించడానికి రోడ్డు ఆక్రమించారనే తప్పుడు సమాచారంతో హైకోర్టుకు వెళ్లి ఆర్డర్ తీసుకొచ్చారని విమర్శించారు. రోడ్డు పక్కన చిరు వ్యాపారులు ఎన్నో ఏళ్లుగా వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారని కోర్టుకు వెళ్లగా కోర్టు స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చిందని గుర్తు చేశారు. కోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ కావాలని జివిఎంసి వారిని బెదిరించి తమ వ్యాపారాలు సాగకుండా ఫుట్‌పాత్‌లను వేయిస్తున్నారని ఆరోపించారు. నిరసనలో తోపుడుబండ్ల వ్యాపారులు, వర్తక సభ్యులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో గ్రామాల అభివృద్ధికి చర్యలు

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి- రంపచోడవరం : ఏజెన్సీలో అన్ని పంచాయతీల పరిధిలో గ్రామాలు అభివద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయ సమావేశ భవనంలో అన్ని పంచాయతీలకు సంబంధించిన సర్పంచ్‌లు, అన్ని పంచాయతీలకు సంబంధించిన సచివాలయ కార్యదర్శులతో అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం పిఒ కట్టా సింహాచలం, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఏజెన్సీలో అన్ని పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల అమలుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల సమస్యలకు సంబంధించిన వివరాలను ఒక ప్రొఫార్మాలో వినతులు అందించాలని వాటిని పరిశీలించి సాధ్యమైనంతవరకు అమలు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. మారుమూల గ్రామాల్లో గిరిజనులు గిరిజన బాలబాలికలు ఆధార్ కార్డు ఎన్‌రోల్ చేసుకునే విధంగా ప్రత్యేక ఆధార్‌కార్డు సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మారుమూల గ్రామాలకు ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరు చేయించాలని అదేవిధంగా లింకు రోడ్లు, మెయిన్‌రోడ్లు, త్రాగునీటి సౌకర్యం, అంగన్వాడి సెంటర్లకు పక్కా భవనాలు, ప్రాథమిక పాఠశాలలకు పక్కా భవనాలు, వంటి సమస్యలను ఆయా గ్రామాల సర్పంచులు పిఒ దృష్టికి తీసుకువచ్చారు. పిఒ స్పందించి సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పి4 ప్రోగ్రాం ద్వారా బాగా వెనుకబడిన మీకు నచ్చిన కుటుంబాలను దత్తత తీసుకొని వారి ఆర్థిక అభివద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ నరసింహారావు, అన్ని పంచాయతీలకు సంబంధించిన సర్పంచులు, పిఎంయు అధికారి చంద్రకళ, పంచాయితీల కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సింహాచలం

పి4తో బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు కృషి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలో నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా పి4 ద్వారా బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దే విధంగా అంతా కృషి చేయాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం రంపచోడవరం సమీపంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటిసి) సమావేశ భవనంలో అన్ని మండలాలకు చెందిన ఎంపిడిఒలు, అన్ని పంచాయతీల సచివాలయాల సిబ్బందితో ఐటిడిఎ పిఒ సింహాచలం, సబ్‌కలెక్టర్ శుభమ్ నొఖ్వాల్ సమావేశం నిర్వహించారు. పిఒ మాట్లాడుతూ ఏజెన్సీలో చాలామంది నిరుపేదలు ఉన్నారని వారంతా ఆర్థికంగా అభివద్ధి చెందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పి 4 బంగారు కుటుంబం కార్యక్రమాన్ని కలసికట్టుగా ముందుకు తీసుకువెళ్లే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒలు శ్రీనివాస్, విశ్వనాథ్, యం.బాపన్నదొర, కె.రాజీ, లక్ష్మణ్, యాదగిరి ఈశ్వరరావు, అన్ని పంచాయతీలకు సంబంధించిన సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆ స్కూల్‌లో మాస్టారు లేరు..!

చెరుకుముల్లు ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి



తరగతి గదిలో ఖాళీగా కూర్చున్న విద్యార్థులు

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ చెరుకుమల్లు గ్రామం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుని నియమించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన చెందుతున్నారు. జూన్ నుంచి ఇప్పటివరకూ పాఠశాలకు ఉపాధ్యాయుని నియమించలేదు. సుమారు 25 మంది విద్యార్థులు ఉన్నారు. తక్షణమే ఉపాధ్యాయుని నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరం అయిపోతున్నారని ఇప్పటికైనా కలెక్టర్, ఐటిడిఎ పిఒ ఇతర అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం సీలేరు ఎపి గురుకుల పాఠశాలలో విద్యార్థులు చేరేందుకు 5, 6, 9 తరగతుల్లో సీట్లు ఖాళీ ఉన్నాయని ఆసక్తి కల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బుచ్చిబాబు తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఐదో తరగతిలో 50 సీట్లు, ఆరో తరగతిలో 10 సీట్లు తొమ్మిదో తరగతిలో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, టిసి, కులధ్రువీకరణ పత్రం తీసుకుని రావాలన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పోలీస్‌సిబ్బంది

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి -జికెవీధి : ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠినచర్యలు తీసుకుంటామని అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని జి.కె వీధి సిఐ వరప్రసాద్, ఎస్సై అప్పలసూరి తెలిపారు. ప్రమాదాలపై అవగాహన కోసం మంగళవారం పోస్టర్లు ఆవిష్కరించారు. సిఐ వరప్రసాద్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై సరైన అవగాహన లేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.



సాగుభూమి పట్టాలు చూపుతున్న గిరిజన రైతులు

సాగుభూమి జోలికొస్తే తరిమికొడతాం

ప్రజాశక్తి -అనంతగిరి: తమ సాగుభూముల జోలికొస్తే సహించేది లేనది తమ భూములు వదిలి పెట్టాలని బెదిరింపులకు పాల్పడుతున్న తహశీల్దార్ వీరభద్రచారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో రైతులు డిమాండ్ చేశారు మండలంలోని నాన్ షెడ్యూల్ భీంపోలు పంచాయతీ గ్రామ రైతులు మంగళవారం గిరిజన సంఘ నాయకులు జె.వెంకటరమణను కలిసి మాట్లాడుతూ తాము పూర్వం నుండి సాగుచేస్తున్న జీడి మామిడి, పనస ఇతర తోటల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నామని అయితే ప్రైవేటు ఎకో టూరిజం నిర్మాణానికి తహశీల్దార్ కట్టబెట్టాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నందకోట రెవెన్యూ పరిధిలోని సర్వేనెం.28లో తహశీల్దార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి సందర్శించారని భూములను పరిశీలించిన అనంతరం తక్షణమే భూములు ఖాళీ చేయాలని తెలిపారని, దీనిపై తహసిల్దార్‌ను ప్రశ్నించగా 'మీరు నా వద్ద రూల్స్ మాట్లాడాతారా మీ పట్టాలు రద్దు చేసి టూరిజంనకు అప్పగిస్తా మీరు ఎక్కడికి వెళ్లి చెప్పుకుంటారో చెప్పుకోండి' అని బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. ఇది వరకే డీ పట్టాలు ఇచ్చి ఉన్నారని మేము తోటలు సాగు చేస్తున్నామని ఎటువంటి సమాచారం లేకుండా ఎలా ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో భీంపోలు రైతులు తదితరులు పాల్గొన్నారు.